# సాక్షి తూర్పుగోదావరి

శనివారం, 1, ఏప్రిల్, 2023




## బంగారు, వెండి పుష్పాలతో పూజలు




పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రూ.లక్ష విరాళం



ఆత్రేయపురం: ర్యాలి ఉమా కమండేలేశ్వర స్వామి ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి దేచిరాజు సత్యనారాయణమూర్తి (గుంటూరు) శుక్రవారం రూ.లక్ష విరాళం అందించారు.

## డెల్టాలకు 6,635 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 6,635 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,960, మధ్య డెల్టాకు 1,275, పశ్చిమ డెల్టాకు 3,400 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.65 అడుగులకు చేరింది.




# టెన్షన్ వద్దు

- సరిగ్గా రాస్తే మార్కులు 'పదిలం'
- టెన్త్ విద్యార్థులకు నిపుణుల సూచనలు
- అందమైన దస్తూరీకే మార్కులు
- సమయపాలన పాటించాలి

### హెల్ప్‌లైన్ నంబర్లు

పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లా యంత్రాంగం మూడు నంబర్లతో 24 గంటలూ అందుబాటులో ఉండేలా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది.

| అధికారి పేరు | సమయం | ఫోన్ నంబర్ |
|---|---|---|
| జి.వర్మ | ఉదయం 6.00 – మధ్యాహ్నం 1.00 | 95429 53958 |
| ఎం.సూర్యనారాయణరాజు | మధ్యాహ్నం 1.00 – రాత్రి 9.00 | 99599 59346 |
| బి.నాగవర్ధన్ | రాత్రి 9.00 – ఉదయం 6.00 | 88853 59983 |

### జిల్లాలో టెన్త్ పరీక్షల వివరాలు

పరీక్ష కేంద్రాలు: 126
హాజరయ్యే విద్యార్థులు: 26,228
పరీక్షల షెడ్యూల్: ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకూ
సమయం: ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ..
- 'సి' కేటగిరీలోని 28 కేంద్రాలకు తగిన విధంగా రవాణా సౌకర్యాలు కల్పించారు.



పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లి స్కూల్లో పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షలు ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నామనేసరికి విద్యార్థుల్లో ఒక విధమైన భయంతో కూడిన ఆందోళన కనిపిస్తుంది. ఇది ఎక్కువైతే ఒత్తిడి పెరిగి, వచ్చిన ప్రశ్నలకు కూడా సమాధానాలు కూడా రాయలేని పరిస్థితి పరీక్షల్లో ఎదురవుతుంది. దీనినే 'టెస్ట్ యాంగ్జయిటీ' అంటారు. ఇది ఒక మోతాదు వరకూ ఫర్వాలేదు. పరీక్షకు సిద్ధమయ్యేలా చేస్తుంది. అది మించితేనే సమస్య. నిజానికి అంతగా భయపడాల్సిందేమీ లేదు. అందరికీ అవే ప్రశ్నలు వస్తాయి.. సంవత్సరం అంతా చదివిన సబ్జెక్టుల్లోని అంశాలతోనే పరీక్ష రాయాలి. ఇటువంటి పాజిటివ్ ఆలోచనతో, పక్కా ప్రణాళికతో రాస్తే పరీక్షల్లో విజయం తేలికగా పాదాక్రాంతమవుతుంది.

**ఆందోళన అస్సలు వద్దు**

- ఈ తక్కువ సమయంలో ఏం చదువుతున్నాం, ఎంతసేపు చదువుతున్నాం అనే దానిపై కాకుండా.. ఎంత శ్రద్ధగా చదువుతున్నామనే అంశం పైనే విజయం ఆధారపడి ఉంటుంది.
- కొంతమంది తాము చదవని, తమకు రాని అంశాలపై ఎక్కువగా ఆందోళన చెందుతూంటారు. ఇది పరీక్ష మొత్తంపై ప్రభావం చూపుతుంది. ఇటువంటి ఆందోళనకు పూర్తిగా స్వస్తి చెప్పాలి. చదివిన పాఠ్యాంశాలను చక్కగా పునశ్చరణ చేసుకోవాలి.
- 'టెస్ట్ యాంగ్జయిటీ' నుంచి బయట పడటానికి సిలబస్‌ను చిన్నచిన్న అంశాలుగా విభజించుకొని నోట్స్, ముఖ్యమైన పాయింట్లు తయారు చేసుకోవాలి.

**'రాత' బాగుండాలి**

- అందమైన దస్తూరీ జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారిని మార్కులు వేసేలా ప్రేరేపిస్తుంది.

### ఆరోగ్యం జాగ్రత్త

- పరీక్షకు ముందు రోజు విద్యార్థికి ఏడెనిమిది గంటల పాటు నిద్ర ఉండేలా చూసుకోవాలి. రాత్రి పూట ఎక్కువగా మేల్కొని చదవడం వలన మెదడు చురుకుగా పని చేయదు.
- పరీక్షలు జరుగుతున్నన్ని రోజులూ తేలికపాటి ఆహారం మితంగా తీసుకోవాలి. రోడ్లపై తినుబండారాలు, నిల్వ చేసిన, నెమ్ము కలిగించే ఆహార పదార్థాల జోలికి వెళ్లరాదు.
- మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా, వ్యాయామం వంటివి చేయాలి.
- వేసవి కాలం కాబట్టి సౌకర్యవంతంగా ఉండే లేత రంగు దుస్తులు ధరించాలి.

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25–30 లైన్లు రాస్తారు. ఇది గజిబిజిగా, దగ్గర దగ్గరగా ఉండి, చూడగానే ఆకట్టుకోదు.

- ఒక పాయింట్ దగ్గర మొదలైన రాత ఆ లైను చివరికి వెళ్లేసరికి పైకో కిందకో పోతుంది. దాంతో ఆ పేజీల్లో లైన్లన్నీ గజిబిజిగా మారతాయి. లైన్లు సమాంతరంగా ఉండేలా చూడాలి.
- ప్రశ్న నంబర్లకు, జవాబులో ముఖ్యమైన పాయింట్లకు ఇచ్చే సంజ్ఞలు మార్జిన్‌లో ఒకదాని కింద మరొకటి వేయవద్దు.
- ఒక లైను చివరి వరకూ రాస్తూ చివరికి వెళ్లగానే అక్కడ సగం పదం రాసి.. మరో సగాన్ని కింద లైనులో రాస్తుంటారు. దీంతో దిద్దే వారికి ఆ పూర్తి పదం వెంటనే అర్థం కాదు. సాధ్యమైనంత వరకూ పదాలను ఒక లైనులో వచ్చేలానే రాయాలి.
- పెన్నును వేళ్లతో బిగుతుగా పట్టుకుని, ఒత్తిపట్టి రాయవద్దు. అలా చేయడం వలన పేజీ రెండోవైపు ఆ అక్షరాలు కనిపిస్తూ చివరికి జవాబు పత్రాలు గజిబిజిగా తయారవుతాయి. పైగా విద్యార్థులకు కూడా రాస్తే కొద్దిసేపటికే వేళ్ల నొప్పి పెడతాయి.
- పరీక్ష పత్రంలో ఏవైనా తప్పులు రాస్తే వాటిని పెన్సిల్ లేదా పెన్నుతో బాగా రుద్దుతారు. దీంతో పేపరంతా నల్లగా మారుతుంది. స్కెచ్ పెన్సిల్‌ను, పలు రంగుల రీఫిల్స్‌ను అడ్డదిడ్డంగా ఉపయోగిస్తారు. ఇది మంచిది కాదు. అవసరమైన చోట ఉపయోగిస్తేనే అందంగా ఉంటుంది.
- సైన్స్‌లో బొమ్మల్లోని భాగాల్ని గుర్తించడంలో ఒక క్రమ పద్ధతి పాటించాలి.

**ఇలా రాస్తే మంచిది**

- ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకున్నాకే జవాబులు రాయాలి. కష్టమైన, సమాధానం తెలియని ప్రశ్నలు కనిపిస్తే ఆందోళన చెందవద్దు. బాగా సమాధానం తెలిసిన ప్రశ్నలకు జవాబులు రాయాలి.
- మార్కుల ఆధారంగా ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో నిర్ణయించుకోగలగాలి.
- సమాధానాలు రాసే ముందు మనసును వీలైనంత తేలికగా ఉంచుకోవాలి. పరీక్ష హాలులో ఒత్తిడి తగ్గించుకోవడానికి కొద్దిసేపు బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ చేయాలి.
- సమాధాన పత్రంలో పేజీకి 15–16 లైన్లు ఉండాలి. పేజీకి పైన, కింద మార్జిన్ విడిచి పెట్టాలి.
- మొదటి వరుసలో ఎంత బాగా రాశారో చివరి వరకూ అదే దస్తూరీ కొనసాగించాలి. వాక్యాలు చక్కగా ఉండేలా చూసుకోవాలి.
- తెలుగు, ఆంగ్లం, హిందీలోని లెటర్ రైటింగ్‌ను ఒకే పేజీలో వచ్చేలా రాయాలి. అక్షర దోషాలు దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలి.
- గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గిస్తారు. ఇచ్చిన సమస్యను అర్థం చేసుకున్న తర్వాతే రాయడం ప్రారంభించాలి.

### సెల్, టీవీ వద్దు

- ఇటీవల ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్లు, టీవీలకు బానిసలుగా మారుతున్నారు. పరీక్షల్లో విజయం సాధించాలంటే ఇవన్నీ పక్కన పెట్టడం తప్పనిసరి.
- పరీక్ష కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లవద్దు.

### సానుకూల ఆలోచనలు ముఖ్యం



పరీక్షలు రాసే ప్రతి విద్యార్థీ కచ్చితంగా సానుకూల ఆలోచనలు పెంచుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోను 'నేను రాయలేను, చేయలేను' అనే ఆలోచన రానివ్వకూడదు. భయాన్ని పారదోలి, తాను చదివిన పాఠాల్లోని ప్రశ్నలకే జవాబు రాస్తున్నానని అనుకోవాలి. ముందు రోజే పరీక్ష సామగ్రి సిద్ధం చేసుకోవాలి. పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయం కంటే ముందుగానే చేరుకోవాలి.

– కె.కృపదేవ్, సైకాలజిస్ట్, రాజమహేంద్రవరం

### ఏర్పాట్లు పూర్తి



పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. సమస్యాత్మక కేంద్రాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. అన్ని కేంద్రాల్లోనూ వెలుతురు, కరెంటు, ఫ్యాన్లు ఉండేలా ఏర్పాట్లు చేశాం. కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం. ఎటువంటి సమస్యలున్నా, విద్యార్థులు ఇబ్బందులకు గురైనా వెంటనే మాకు తెలియజేయవచ్చు.

– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి

## న్యూస్‌రీల్

### శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.32 కోట్లు

ద్వారకా తిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ లెక్కింపు జరిగింది. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపును పురస్కరించుకుని గడచిన 16 రోజులకుగాను జరిపిన ఈ లెక్కింపులో స్వామి వారికి నగదు రూపేణా రూ.1,32,12,581 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.త్రినాథరావు తెలిపారు. అలాగే భక్తుల కానుకల రూపేణా 176 గ్రాముల బంగారం, 3.394 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయని తెలిపారు. వీటితో పాటు రద్దయిన పాత రూ.1,000, రూ.500 నోట్ల రూపంలో రూ.4 వేలు లభించాయన్నారు. ఇదిలా ఉండగా 2021–22 ఆర్థిక సంవత్సరంలో హుండీల ద్వారా స్వామి వారికి రూ.31,76,33,101 ఆదాయం రాగా, 2022–23లో అది రూ.35,46,92,522కు పెరిగింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం శ్రీవారి హుండీ ఆదాయం రూ.3,70,59,421 మేర పెరిగిందని ఈఓ త్రినాథరావు చెప్పారు.

### సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు ప్రారంభం

రాజానగరం: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ క్రీడా పోటీల్లో భాగంగా గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని పీడీ డాక్టర్ సీఎం హెన్రీ తెలిపారు. ఈ పోటీలకు 34 కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు.

### సీఎస్ఆర్ నిధులతో విస్తృత సేవలు



కృత్రిమ అవయవం అందజేసి, షేక్‌హ్యాండ్ ఇస్తున్న ఓఎన్‌జీసీ ఈడీ అమిత్ నారాయణ్

రాజమహేంద్రవరం రూరల్: కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సీఎస్ఆర్ నిధులతో విస్తృత సేవలు అందిస్తున్నామని ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. ఇందులో భాగంగా అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు పంపిణీ చేశామని చెప్పారు. ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఆవరణలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాలకు చెందిన 25 మందికి రూ.42.78 లక్షలు సీఎస్ఆర్ నిధులతో శుక్రవారం కృత్రిమ అవయవాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అమిత్ నారాయణ్ మాట్లాడుతూ, దురదృష్టవశాత్తూ ప్రమాదాల్లో, ఇతర కారణాలతో చేతులు, కాళ్లు లేక బాధితులు ఎంతో వేదనకు గురయ్యారన్నారు. అటువంటి వారికి ఓఎన్‌జీసీ ద్వారా కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ఢిల్లీకి చెందిన గ్రీన్‌టెక్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అత్యంత నాణ్యతా ప్రమాణాలతో కృత్రిమ అవయవాలు తయారు చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్‌టెక్ సీఈఓ షరన్, ఓఎన్‌జీసీ హెచ్ఆర్ హెడ్ నవేదారావు పాల్గొన్నారు.

### కేసాప్రగడ కన్నుమూత

రాజమహేంద్రవరం రూరల్: నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, రామాయణ రత్నాకర బిరుదాంకితుడు, డాక్టర్ కేసాప్రగడ సత్యనారాయణ (74) శుక్రవారం సాయంత్రం అమలాపురంలో అస్వస్థతతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రంపచోడవరం ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసి, ఉద్యోగ విరమణ చేసిన కేసాప్రగడ రామాయణ, భారత, భాగవతాలపై వేలాది ప్రసంగాలు చేశారు. ప్రసంగంలో అనేక శ్లోకాలు, పద్యాలు అనర్గళంగా ఉదహరించి శ్రోతలను ఆకట్టుకునేవారు. అనేక సాహితీ రూపకాల్లో పాల్గొన్నారు. కేసాప్రగడ పార్థివ దేహానికి రాజమహేంద్రవరంలో శనివారం అంత్యక్రియలు జరుగుతాయి. ఆయన మృతికి మహామహోపాధ్యాయ డాక్టర్ శలాక రఘునాథశర్మ, భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు, రాష్ట్రపతి సమ్మానిత విశ్వనాథ గోపాలకృష్ణ, ప్రవచన రాజహంస డాక్టర్ ధూళిపాళ మహాదేవమణి, తెలుగు పండితురాలు డాక్టర్ సీయస్వీ రమణీకుమారి, నగర ప్రముఖులు డీవీబీ రాజు, వక్కలంక శ్రీరామం తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## శరవేగంగా మోరంపూడి ఫ్లై ఓవర్ పనులు



బ్రిడ్జి నిర్మాణంపై విలేకర్లకు వివరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: నగర వాసుల చిరకాల కోరిక అయిన మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, స్థానిక ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. ఎఫ్‌ఓబీకి సంబంధించిన స్లాబ్స్, పిల్లర్స్, ఐరన్ రాక్స్ తదితర పనులు వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఏడున్నర ఎకరాల స్థలంలో జరుగుతున్నాయి. ఈ పనులను మీడియాకు ఆయన శుక్రవారం చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మోరంపూడి ఎఫ్‌ఓబీని 38 స్తంభాలతో, 1.04 కిలో మీటర్ల పొడవున నిర్మిస్తున్నారని చెప్పారు. ఒక్కో స్తంభాన్ని (పిల్లర్) 60 అడుగుల లోతు నుంచి నిర్మిస్తున్నారన్నారు. మొత్తం 38 పిల్లర్లకు 7,500 స్లాబులు అవసరమని, వాటిని ఇక్కడే తయారు చేస్తున్నారని తెలిపారు. మోరంపూడి జంక్షన్ వద్దకు వచ్చేసరికి అటు లాలాచెరువు, ఇటు బొమ్మూరు, మరోవైపు నామవరం వెళ్లే మార్గాలు 60 మీటర్ల వెడల్పున (180 అడుగుల నుంచి 200 అడుగుల వరకూ) ఉంటాయని వివరించారు. మోరంపూడి జంక్షన్ సమీపాన ఇటీవల నిర్మించిన వంద అడుగుల రోడ్డు నుంచి నిమ్మకాయల మార్కెట్ వరకూ ఎఫ్‌ఓబీ నిర్మిస్తారని చెప్పారు. వచ్చే డిసెంబర్ నెలాఖరుకు ఈ బ్రిడ్జి పనులు పూర్తవుతాయని ఎంపీ తెలిపారు. దీని నిర్మాణంతో మోరంపూడి జంక్షన్ వద్ద ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు.

**త్వరలో మరో ఐదు ఎఫ్‌ఓబీలు**

జాతీయ రహదారినిపై వేమగిరి, బొమ్మూరు, లాలాచెరువు, దివాన్ చెరువు, గ్యామన్ ఇండియా రోడ్డు వద్ద మొత్తం అయిదు ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు కూడా త్వరలోనే ప్రారంభించేలా ప్రయత్నిస్తానని ఎంపీ భరత్‌రామ్ చెప్పారు. మే లేదా జూన్ నెలల్లో ఈ పనులు ప్రారంభం కావచ్చన్నారు. ఈ వంతెనల విషయంలో గత ప్రజాప్రతినిధులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద తొలిసారి ఫ్లై ఓవర్ మంజూరైనప్పుడే అప్పటి టీడీపీ నేతలు కాస్త శ్రద్ధతో ప్రయత్నిస్తే ఈ వంతెన నిర్మాణం ఎప్పుడో పూర్తయ్యేదని, ఇన్ని వందల ప్రమాదాలు, మరణాలు జరిగి ఉండేవి కావని అన్నారు. ఎఫ్‌ఓబీల నిర్మాణ విషయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నానని ఎంపీ భరత్ చెప్పారు.

## పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- హోం మంత్రి తానేటి వనిత
- నూతన 104 అంబులెన్సులు ప్రారంభం



104 అంబులెన్సులను ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు మరో పదహారు 104 అంబులెన్సులు మంజూరు చేసిందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. నూతన 104 వాహనాలను పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆసుపత్రితో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణ ప్రజల చెంతకే వెళ్లి వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ వాహనాల ద్వారా ఉదయం పూట ఆయా గ్రామాల్లో అన్ని రకాల అనారోగ్యాలకు, సాధారణ వైద్య సేవలు (ఓపీ), గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు, నవజాత శిశువులకు, చిన్న పిల్లలకు ఆరోగ్య సేవలతో పాటు వ్యాధి నిరోధక టీకాలు అందిస్తారని వివరించారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న వారి ఇళ్ల వద్దకే మధ్యాహ్నం వెళ్లి వైద్యసేవలందిస్తారన్నారు. పాఠశాలల్లో చదువుకునే బడి పిల్లలకు వారానికి ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి వారికి సైతం ఇంటికే వెళ్లి వైద్య సేవలు అందిస్తారని, క్షయ, క్యాన్సర్ వంటి వ్యాధిగ్రస్తులకు అవసరమైన చికిత్స అందిస్తారని వివరించారు. ఒక్కో వాహనానికి రూ.24 లక్షల చొప్పున వెచ్చించారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మంజూరైన 16 వాహనాల్లో వివిధ మండలాలకు 15 కేటాయించామన్నారు. ఒక వాహనాన్ని అదనంగా అందుబాటులో ఉంచుతున్నారని చెప్పారు. ప్రస్తుతం వచ్చిన వాటితో కలిపి జిల్లాలో 104 అంబులెన్సులు 34 ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎస్.ధర్మరాజు, మైఖేల్, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా రీ సర్వే పూర్తి చేయాలి



రంపయర్రంపాలెంలో రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్, ఆర్డీఓ చైత్రవర్షిణి

గోకవరం: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో నిర్వహిస్తున్న రీ సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో రాజమహేంద్రవరం ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణితో కలిసి రీ సర్వేపై గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రీ సర్వే సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అంతకు ముందు రంపయర్రంపాలెంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గోకవరంలో నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో గుర్తించిన భూములను పరిశీలించారు. ఇళ్ల స్థలాల కోసం సుమారు 20 ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని జేసీకి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, సర్వేయర్లు, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## అందుబాటులోకి ఆర్టీసీ లైవ్ ట్రాక్ యాప్

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికులు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు లైవ్ ట్రాక్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం కోరారు. రిజర్వేషన్ చేయించుకున్న బస్సు సర్వీసు నంబర్ ద్వారా సంబంధిత బస్సు ఎక్కడ ఉందో, ఏ సమయానికి ప్రయాణికులున్న ప్రాంతానికి వస్తుందో తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను శనివారం నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా మిగిలిన బస్సుల వివరాలు కూడా తెలుసుకోవచ్చున్నారు. ఇప్పటికే యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారు అప్‌డేట్ చేసుకోవాలని షబ్నం కోరారు.

## బైజూస్ యాప్‌పై శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: బైజూస్ యాప్‌లో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌పై అవగాహనకు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. కాకినాడ జిల్లాకు చెందిన 1,100 మంది 8వ తరగతి ఉపాధ్యాయులకు ఈ యాప్ ఉపయోగించడం, నిర్వహణపై వెబెక్స్ ద్వారా బొమ్మూరు డైట్‌లో శుక్రవారం ఆన్‌లైన్ శిక్షణను ఆయన ప్రారంభించారు. బైజూస్ ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలు బోధించడంలోని ఉద్దేశాలు, లక్ష్యాలు, ట్యాబ్‌ను ఎన్‌రోల్ చేయడంపై లెక్చరర్ జె.కళావతి వివరించారు. అలాగే బైజూస్ ట్యాబ్‌ల నిర్వహణ, సాంకేతిక సమస్యలు, పరిష్కారాలపై లెక్చరర్లు కొమ్ముల వెంకట సూర్యనారాయణ, కె.గంగాధరరావు అవగాహన కల్పించారు. శనివారం కోనసీమ, సోమవారం తూర్పు గోదావరి జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని సుబ్రహ్మణ్యం తెలిపారు.

## 'రావిశాస్త్రి సాహితి' పుస్తకావిష్కరణ



రావిశాస్త్రి సాహితీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్ సంపాదకుడిగా ప్రచురించిన 'రావిశాస్త్రి సాహితి' పుస్తకాన్ని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు శుక్రవారం ఆవిష్కరించారు. గత ఏడాది జూలై నెల చివరి మూడు రోజులు 'రాచకొండ విశ్వనాథశాస్త్రి సాహిత్య సమాలోచనం' పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రముఖులు, సాహితీవేత్తలు సమర్పించిన పరిశోధన పత్రాలతో ఈ పుస్తకం రూపొందించారు. 80 వ్యాసాలతో రెండు సంపుటాలుగా, ఐఎస్‌బీఎన్ నంబరుతో పూర్తి అకడమిక్‌గా ఈ పుస్తకాన్ని తయారు చేసిన డాక్టర్ ప్రసాద్‌ను వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ సభ్యుడు ఆచార్య కేవీఎస్ రమేష్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, పుస్తక సంపాదకుడు డాక్టర్ ప్రసాద్, అధ్యాపకులు తలారి వాసు, తరపట్ల సత్యనారాయణ, పీఏ నాయుడు, సీహెచ్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు

- జిల్లా ఆవిర్భావ దినోత్సవం నాడు మంజూరు
- 100 మందికి రూ.3 కోట్ల రుణాలిచ్చేందుకు బ్యాంకుల ఆమోదం
- కలెక్టర్ మాధవీలత వెల్లడి




సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, అధికారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నవ్య తూర్పు గోదావరి జిల్లా ఏర్పడి ఈ నెల నాలుగో తేదీకి ఏడాది కావస్తున్న సందర్భంగా ఆ రోజు ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు చేయనున్నామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా పరిశ్రమల అభివృద్ధి కమిటీ ఏడో సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సుమారు 100 మంది మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకుగాను రూ.3 కోట్ల మేర రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఆమోదం తెలిపాయని చెప్పారు. వీరందరూ పరిశ్రమలు స్థాపిస్తే 300 నుంచి 500 మంది వరకూ నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతుందని అన్నారు. పారిశ్రామికాభివృద్ధిపై ఆసక్తి కలిగిన మరింత మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. 4, 5 సమావేశాల్లో సింగిల్ విండో విధానం కింద ఇచ్చిన అనుమతుల పురోగతిపై అధికారులు వివరించారు. 5వ సమావేశం నాటికి జిల్లాలో రూ.474.89 కోట్లతో 2,861 పరిశ్రమల ద్వారా 11,741 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. ఈ సమావేశం నాటికి రూ.630.76 కోట్లతో 3,783 పరిశ్రమలు ఏర్పాటు చేసి, 15,200 మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. తద్వారా 132.22 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. జిల్లాలో రూ.1,350 కోట్లతో సోలార్ గ్లాస్ యూనిట్ ఏర్పాటవుతోందని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 8 రంగాల్లో 132 యూనిట్లు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన ఆవాస్ యోజన కింద 214 యూనిట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 275 మంజూరు చేశామని, వాటిలో 192 ఏర్పాటయ్యాయని తెలిపారు. సింగిల్‌విండో కింద 69 దరఖాస్తులు రాగా 33 యూనిట్లకు అనుమతులు ఇచ్చామని, ఒకటి తిరస్కరించామని, 35 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. పరిశ్రమల ప్రోత్సాహకం కింద ఓసీలకు 2, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో 22 మందికి రూ.2.62 కోట్ల ఇన్సెంటివ్ విడుదల చేశామని కలెక్టర్ తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించి జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా 90, ఏపీకేవీఐబీ కింద 47, ఏపీఎంఐపీ కింద 28 దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆమోదించి బ్యాంకులకు సిఫారసు చేశామని వివరించారు.

## క్లుప్తంగా

### ఆస్కార్ అవార్డు దేశానికే గర్వకారణం



సినీ దర్శకులు రాఘవేంద్రరావును సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణారావు, డైరెక్టర్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆర్ఆర్ఆర్ సినిమాకు అస్కార్ అవార్డు రావడం తెలుగుజాతికే కాకుండా, దేశానికి గర్వకారణమని ప్రముఖ దర్శకులు కె.రాఘవేంద్రరావు పేర్కొన్నారు. ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో యువ కళాకారుల కెరియర్ వర్క్‌కు ఉపయోగపడే విధంగా కేఆర్ఆర్ వర్క్స్ యూ ట్యూబ్ చానల్ ప్రారంభిస్తున్నానని చెప్పారు. నేటి కాలంలో యూట్యూబ్, సోషల్ మీడియా వేదికగా పలువురు తమ నటనా ప్రతిభను తెలియజేస్తున్నారన్నారు. ప్రతిభ ఉంటే ఏరంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. ప్రగతి కళాశాల ప్రెస్‌క్లబ్ విద్యార్థులు దర్శకులు రాఘవేంద్రరావు బయోగ్రఫీ, ఆయన చిత్రీకరించిన సినిమాలపై రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం అకర్షణగా నిలిచింది. ప్రగతి కళాశాల చైర్మన్ పి.వి.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు తమకు ఇష్టం ఉన్న రంగంపై ఆసక్తి పెంచుకుని అభివృద్ధి చెందాలని, ఇదే కళాశాలలో చదివిన విద్యార్థులు పలు రంగాలలో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు.

### పునరావాస కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో విజిలెన్స్ ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం యూనిట్ పరిధిలోని మహిళలు, బాలికలు, బాలురు, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, మత్తు పదార్థాలకు బానిసలు, బిచ్చగాళ్లు, ట్రాఫికింగ్ వ్యక్తులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని భారతి వికలాంగుల సేవాసమితి సొసైటీ, భాస్కర్ సంక్షేమ సంఘంలో సౌకర్యాలను తనిఖీ చేశారు. కాకినాడ అశోకనగర్‌లో శిశుగృహను తనిఖీ చేశారు. అమలాపురం మండలం ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రాన్ని పరిశీలించారు. వీటిపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించబోతున్నట్లు ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ తెలిపారు. తనిఖీల్లో డీఎస్పీ పి.ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, తహసీల్దార్ విజయకుమార్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ జీవానందం పాల్గొన్నారు.

# వెంకన్న పెండ్లికొడుకాయెనె

- నేడు వాడపల్లి వెంకన్న రథోత్సవం, కల్యాణం
- తీర్థం, ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. వేకువ జామున భరద్వాజ గోత్ర పాలకుడు శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. భార్గవశ గోత్ర నామాలతో శ్రీదేవిని, కాశ్యప గోత్రీకురాలు భూదేవిని పెండ్లి కుమార్తెలుగా అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6–15 గంటలకు స్వామి వారి ధ్వజారోహణ, అంకురార్పణ, నిత్య బలిహరణ అనంతరం స్వామి వారి దర్శనాలకు అనుమతి ఇచ్చారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం శ్రీమాన్ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చక బృందం ఘనంగా నిర్వహించారు.

**నేడు రథోత్సవం, కల్యాణం**

చైత్రశుద్ధ ఏకాదశి శనివారం రాత్రి 7.01 గంటలకు స్వామి కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం 3గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పిస్తారు.

**దేశభక్తికి గుర్తుగా స్మారక చిహ్నం**

1931లో స్వాతంత్ర్య ఉద్యమంలో ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న కల్యాణ ఉత్సవాల్లో దేశభక్తి కట్టలు తెంచుకుంది. గాంధీజీ పిలుపు మేరకు పరిసర ప్రాంతాలకు చెందిన నాయకులు రథోత్సవ కార్యక్రమంలో దేశ సమైక్యతను చాటే స్వరాజ్య జెండాను, గాంధీజీ చిత్ర పటాన్ని స్వామివారి రథంపై ఉంచేందుకు ప్రయత్నించారు.



సిద్ధమైన స్వామివారి కల్యాణ వేదిక



సమరయోధుల స్మారక చిహ్నం

దీంతో బ్రిటీష్ సైన్యం జరిపిన కాల్పుల్లో ముగ్గురు అమరులు కాగా మరో 16మందిపై కేసులు నమోదు చేశారు. వారి దేశభక్తికి గుర్తుగా ఆలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నన్ని ఏర్పాటు చేశారు.

**భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు**

రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానుండడంతో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మెర్లపాలెం నుంచి వాడపల్లి వరకు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలు, పాలు, పులిహోర , అన్నదానం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.



ఉత్సవానికి సిద్ధమైన రథం

**వ్యాపారుల సందడి**

తీర్థ మహోత్సవానికి వ్యాపార సముదాయాలు సిద్ధమయ్యాయి. వారం రోజులపాటు నిర్వహించే స్వామి వారి కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తులు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తూ ఉంటారు. రంగుల రాట్నం, జెయింట్‌వీల్, వంటివి నిర్వాహకులు సిద్ధం చేశారు. భక్తుల కోసం ఆలయంలో లడ్డూలను తయారు చేస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

**విద్యుత్ కాంతులతో వెంకన్న ఆలయం**

ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణ వేదిక, పచ్చని పందిర్లు, విద్యుత్‌కాంతుల మధ్య స్వామి వారి ఆలయం కాంతులీనుతోంది. మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ఆలయం కల్యాణోత్సవానికి ముస్తాబైంది.

**విస్తృత పోలీస్ బందోబస్తు**

రాష్ట్ర నలుమూలల నుంచి యాత్రికులు స్వామి వారి కల్యాణోత్సవాలకు తరలిరానున్న దృష్ట్యా అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు, సుమారు 200 మంది పోలీస్, హోంగార్డులు ఉత్సవ ఏర్పాట్లుకు తరలివచ్చారు.

### 'బార్' ఎన్నికలకు తొలిరోజు 10 నామినేషన్లు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు తొలిరోజు శుక్రవారం 10 నామినేషన్లు దాఖలయ్యాయి. 2023–24 సంవత్సరానికి బార్ నూతన కార్యవర్గానికి ఏప్రిల్ 17వ తేదీన ఎన్నిక జరగనుంది. తొలిరోజు ఉపాధ్యక్షుడిగా కె.వి భద్రరావు, జనరల్ సెక్రటరీలుగా చక్కా ఎస్.వి.ఎస్. శ్రీనివాస్, బంధకవి రామలింగశర్మ నామినేషన్లు దాఖలు చేశారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా చాగంటి మురళీధర్, లైబ్రరీ సెక్రటరీగా షేక్ అమీర్ జాని, కోశాధికారిగా వెంకటరెడ్డి బహదూర్ షా, మహిళా ప్రతినిధిగా జి.దివ్య శ్రీ విద్య , జూనియర్ కమిటీ మెంబర్లుగా కె.ఏడుకొండలు, మొహిద్దీన్, వి.బిందుశ్రీ నామినేషన్లు దాఖలు చేశారని, ఈ నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 3వ తేదీ వరకు కొనసాగుతుందని అడ్‌హాక్ కమిటీ సభ్యులు మహ్మద్ జవహర్ ఆలీ, ఎ.వెంకటేష్, టీపీఆర్ చంద్రశేఖర్, కేఆర్ వీ.భద్రరాజు, ఎస్.దిలీప్ తెలిపారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

తుని: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శుక్రవారం తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..తుని రైల్వే పోలీసుస్టేషన్ పరిధి గొల్లప్రోలు–రావికంపాడు రైల్వే స్టేషన్ల మధ్య పిఠాపురం నుంచి తుని వైపు వస్తున్న రైలుబండి నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి జారిపడి మృతి చెందాడు. మృతుడు చిలుకాకపచ్చ జర్కిన్, సిమెంట్ కలర్ ఫుల్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరినట్లు వివరించారు. వివరాలు తెలిసినవారు 94906 19020, 94948 87786 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## అటవీ సంరక్షణలో ప్రజా సహకారం

రాజానగరం: అటవీ సంరక్షణలో ప్రజల సహాయ, సహకారాలు ఎంతో కీలకమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అటవీ ప్రధాన ముఖ్య సంరక్షణాధికారి వై.మధుసూదనరెడ్డి సూచించారు. దివాన్ చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీలో ఆరు మాసాలు శిక్షణ పూర్తి చేసుకున్న 6వ బ్యాచ్ ఫారెస్టు బీట్ అధికారులు, 9వ బ్యాచ్ ఫారెస్టు సెక్షన్ అధికారులకు శుక్రవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో సర్టిఫికెట్లు అందజేశారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ అడవిని తమ సముదాయక ఆస్తిగా ప్రజలు భావించినప్పుడు వారే దానిని రక్షించుకుంటారన్నారు. ఆటువంటి భావన ప్రజలలో కల్పించడం కోసం కృషి చేయడం పైనే విధి నిర్వహణలో విజయం ఆధారపడి ఉంటుందన్నారు. నగర వనాల ఏర్పాటు, ఏకో టూరిజం ప్రాజెక్టుల నిర్వహణ, అడవులలోకి పబ్లిక్‌ని అనుమతించడం వంటి చర్యలు ప్రజలను అటవీ సంరక్షణలో భాగస్వాముల్ని చేస్తాయన్నారు. అటవీ ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేయడం కంటే అవి రాకుండా శ్రద్ధ తీసుకోవడమే గొప్ప విషయమన్నారు. కోరంగి అభయారణ్యంలో ప్లాస్టిక్ నివారణ చర్యలు విజయవంతమైన విషయాన్ని ప్రస్తావిస్తూ ప్లాస్టిక్ సీసాలను అనుమతించాలంటే కాషన్ డిపాజిట్ తీసుకుంటున్నారన్నారు. వాటిని తిరిగి కౌంటర్లలో అప్పగించిన తరువాతనే డిపాజిట్‌ని వెనక్కి ఇస్తున్నారన్నారు. ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ పీఏవీ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ అకాడమీలో మౌలిక సదుపాయాలకు ప్రణాళికను తయారు చేశామన్నారు. 26 మంది ఎఫ్ఎస్ఓలు, 29 ఎఫ్‌బీఓలు పరీక్షలకు హాజరుకాగా, వారిలో అంతా ఉత్తీర్ణులయ్యారన్నారు. రాజమహేంద్రవరం ముఖ్య అటవీ సంరక్షణాధికారి ఎస్. శ్రీశరవణన్, ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బీఓ కోర్సు డైరెక్టర్లు టి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్‌వీ శివరామప్రసాద్, ఏసీఎఫ్‌లు ఏవీ రమణమూర్తి, వి.శ్రీహరిగోపాల్, టి.చక్రపాణి, ఎఫ్ఆర్ఓ అనూష, జె.దామోదర్ పాల్గొన్నారు.



అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మధుసూదనరెడ్డి

# టెన్త్ విద్యార్థి అనుమానాస్పద మృతి

- ఈతకు వెళ్లిన ఐదుగురు విద్యార్థుల్లో సాయిదుర్గ మృతి
- తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన
- సమగ్ర దర్యాప్తునకు అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమణ

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో పదో తరగతి విద్యార్థి ఈతకు వెళ్లి కోనేరులో అనుమానాస్పదంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు మృతదేహంతో పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు, పెదపూడి ఎస్సై పి.వాసు, డీఈఓ అన్నపూర్ణ, పాఠశాల హెచ్ఎం.కె.శ్రీనివాసు, తదితరులు ఆందోళనకారులతో మాట్లాడారు. దీనిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమింపజేశారు. సీఐ శ్రీనివాసు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మామిడాడ గ్రామానికి చెందిన పేలూరి వెంకన్న, దుర్గ దంపతులకు రెండో సంతానం సాయిదుర్గ(16). సాయిదుర్గ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ప్రతి రోజు మాదిరిగా సాయిదుర్గ పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులు గ్రూప్ ఫొటో తీయించుకున్న అనంతరం సాయిదుర్గతోపాటు జి.సూర్యతేజ, కె.అనిల్‌కుమార్, కె.వంశీ, అఖిల్ ఆదిత్య ఫొటో తీసుకున్నారు. అనంతరం సాయిదుర్గ ఇంటి వద్ద స్కూల్ బ్యాగ్‌లను పెట్టి కోనేరులో స్నానానికి వెళ్లారు. అక్కడ అఖిల్‌ఆదిత్య, సాయిదుర్గ ఇద్దరు కోనేరులో స్నానానికి దిగారు. మిగిలిన ముగ్గురు మృతుని ఇంటికి వచ్చి బ్యాగ్‌లు తీసుకుని వెళ్లిపోయారు. కొంతసేపటికి కోనేరులో సాయిదుర్గ మునిగిపోయాడంటూ స్థానికులు, అఖిల్ ఆదిత్య సాయిదుర్గను గట్టుపైకి తీసుకొచ్చారు. వెంటనే విద్యార్థులు ఈ విషయం ఉపాధ్యాయులకు తెలియజేసి స్థానికుల సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు చనిపోయినట్లు ధ్రువీకరించారు. ఈ సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధుమిత్రులు తన కొడుకుని తోటి విద్యార్థులు చంపేశారంటూ పాఠశాల వద్ద మెయిన్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. పాఠశాల నుంచి ఎందుకు బయటకు పంపించారంటూ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. దుర్ఘటనకు మీరే బాధ్యులని ఆరోపించారు. ఆందోళనతో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వివరాలు నమోదు చేశారు. తండ్రి వెంకన్న ఫిర్యాదుపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు. మృతుని తండ్రి, తల్లి, అన్నయ్య ఫణిదుర్గ చేపల వ్యాపారం చేస్తుంటారు.



మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు



ఈతకు వెళ్లి మృతి చెందిన సాయిదుర్గ

**చిన్నోడినైనా చదివించి ఉద్యోగం చేయిద్దామనుకున్నాం**

పెద్దోడు పదో తరగతి చదివి చేపల వ్యాపారం చేస్తూ తోడుగా ఉన్నాడు. చిన్నోడినైనా చదివించి పెద్ద ఉద్యో గం చేయిద్దామని అనుకున్నామని, మృత్యువు ఈత రూపంలో తీసుకుపోయిందని తల్లి దుర్గ, తండ్రి వెంకన్న రోదిస్తున్న తీరు అందర్నీ కంటతడి పెట్టించింది. మూడ్రోజుల్లో జరుగనున్న పదో తరగతి పరీక్షలు బాగా రాస్తానంటూ చెప్పి తమకు అందనంత దూరానికి వెళ్లిపోయాడు అంటూ వారు కంటతడి పెట్టారు.

### నాసిరకం మందుల విక్రేతకు జైలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నాసిరకం మందులు అమ్మిన కేసులో ఒక వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. విజయవాడకు చెందిన హానెస్ట్ ఫార్ములేషన్స్, సత్యనారాయణ ఎంటర్‌ప్రైజస్ యజమాని ఏవీఆర్ఎస్.సత్యనారాయణ నాసిరకం మందులు తయారుచేసి అమ్ముతున్నాడు. విషయం తెలిసిన అప్పటి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.చంద్రరావు 2016లో ఆ ప్రాంతంలో దాడి చేసి నాసిరకం మందులను పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో వాదనలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరత్నం నిర్వహించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు నాగమణి ఆధ్వర్యంలో ప్రస్తుతం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ పలు ఆధారాలను కోర్టుకు అందజేశారు.



### వివాహిత ఆత్మహత్య

తుని రూరల్: మండలంలోని రాజుపేట గ్రామంలో వివాహిత గింజాల లోవతల్లి (20) ఆత్మహత్య చేసుకున్నట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ శుక్రవారం తెలిపారు. సంవత్సరం వయసు గల కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో మనస్థాపం చెందిన లోవతల్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోందన్నారు. రెవెన్యూ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో పంచనామా నిర్వహించినట్టు తెలిపారు. భర్త కామరాజు మానసిక స్థితి బాగోలేదన్నారు. మృతురాలి సోదరి ఆవాల రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### మృదంగ విద్వాంసుడు నాగేశ్వరరావు మృతి

- నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు



నాగేశ్వరావు (ఫైల్)

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసుడు వక్కలగడ్డ నాగేశ్వరరావు (88) శుక్రవారం మృతిచెందారు. దీర్ఘకాలంగా ఆయన కపిలేశ్వరపురంలోని శ్రీ సర్వారాయ హరికథా పాఠశాలలో మృదంగ ఉపాధ్యాయునిగా సేవలందిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో హరికథా ప్రదర్శనల్లో మృదంగ సహకారమందించి మంచి గుర్తింపు సాధించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ వంటి ప్రముఖుల కచేరీలో ప్రశంసలందుకున్నారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ హయాంలో రాష్ట్రపతి భవన్‌లో తన కళా ప్రదర్శనతో మెప్పు పొందారు. కళ్లను అయన కుటుంబ సభ్యులు కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకి దానం చేశారు. సంగీతంలో ఎంతోమంది మృదంగ కళాకారులను తయారు చేసిన నాగేశ్వరరావు మృతి కళా ప్రపంచానికి తీరని లోటు అని సర్పంచ్ సాకా శ్రీనివాస్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

### కాలువలో మునిగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండల పరిధిలోని వెలిచేరు గ్రామానికి చెందిన మంతెన సుబ్రహ్మణ్యరాజు (67) కాలువకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. మృతదేహం శుక్రవారం వెలిచేరు సమీపంలో లభ్యమైనట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఆలోచింపజేసిన జారుడుమెట్లు

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో రామాలయం నిర్మించి వందేళ్లు కావడంతోపాటు శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గొల్లపల్లి చెల్లయ్య మెమోరియల్ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కళాపరిషత్ అధ్యక్షుడు, ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి) ఆధ్వర్యంలో పెద్దనాపల్లిలో వచ్చేనెల 3 వరకు పోటీలు జరగనున్నాయి. పోటీలకు మాజీ ఎంపీ ఎంఎం పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి వెలిగించారు. తొలిరోజు హైదరాబాద్‌కు చెందిన కళాంజలి వారు ప్రదర్శించిన జారుడుమెట్లు నాటిక ఆలోచింపజేసింది. దేశ స్వాతంత్ర్యం కోసం అనేకమంది ప్రాణత్యాగం చేయగా నేటి సమాజంలో స్వార్థంతో జీవిస్తున్నారు. బ్రిటీషు వారు వదిలివెళ్లిన సంస్కృతిని ఇప్పటివరకు మనవారు పాటిస్తున్నారు. దీనిని రూపుమాపేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలనే నినాదంతో నాటిక కొనసాగింది. కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించగా కంచర్ల సూర్యప్రకాశరావు రచన అందించారు.

## థర్డ్ స్పేస్ ఎండోస్కోపిక్‌పై వర్క్ షాప్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జీర్ణకోశం, అన్నవాహికల్లోని సునిశితమైన ప్రాంతాల్లో చికిత్సలు చేసే 'థర్డ్ స్పేస్ ఎండోస్కోపిక్ వర్క్ షాపు' జీఎస్ఎల్ స్వతంత్ర హాస్పిటల్‌లో శుక్రవారం జరిగింది. జీఎస్ఎల్ వైద్య, విద్యాసంస్థల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం నిపుణుడు డాక్టర్ కె.అరుణ్, డాక్టర్ ఎస్.గౌతమ్ నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌నకు ఫ్యాకల్టీగా హైదరాబాద్ ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ నిపుణుడు డాక్టర్ జహీర్ నబీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆహారాన్ని సజావుగా మింగలేని పరిస్థితుల్లో ఎండో స్కోపీ ద్వారా పీవోఈఎం (పెరోరల్ ఎసోఫాగెల్ మైటోమి) చికిత్స చేస్తారు. ఈ సమస్యకు గతంలో శస్త్రచికిత్స చేసేవారన్నారు. జీర్ణకోశంలో క్యాన్సర్లు కనబడినపుడు గతంలో శస్త్రచికిత్సల ద్వారా వాటిని తొలగించడానికి అవకాశం వుండేదని, ఇపుడు ఈఎస్‌డీ (ఎండోస్కోపిక్ సబ్ మ్యుకోసల్ డిసెక్షన్) ద్వారా వాటిని తొలగించే అవకాశం వచ్చిందన్నారు. జీఎస్ఎల్ స్వతంత్ర వర్క్ షాపులో ఈ రెండు రకాల కేసులను విజయవంతంగా పూర్తిచేశారన్నారు. మహానగరాలకే పరిమితమైవున్న అత్యంత అధునాతనమైన వైద్యచికిత్సలు రాజమండ్రిలో కూడా అందుబాటులో వున్నాయని, వైద్య ప్రపంచానికి, ప్రజలకు తెలియచెప్పడానికి ఈ వర్క్ షాప్ నిర్వహించామన్నారు. ఈ చికిత్సలకు లక్షనుంచి లక్షన్నర రూపాయలు ఖర్చవుతుందన్నారు. ఈ వర్క్ షాపులో రెండు కేసులను ఉచితంగానే చేశామన్నారు. దీనికి 30 మందికి పైగా ఫిజీషియన్లు, సర్జన్లు హాజరయ్యారు. వీరిలో డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ సమీర్ రంజన్ నాయక్, తదితరులు ఉన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్య బృందం

## అస్వస్థతతో ఉన్న పీవో ఇంట్లో సీబీఐ విచారణ

- పోస్టల్ నిధుల గోల్‌మాల్‌పై ఆన్‌లైన్ రికార్డుల పరిశీలన

అమలాపురం టౌన్: విలస పోస్టాఫీస్‌లో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా జరిగిన రూ.1.18 కోట్ల గోల్‌మాల్‌పై విశాఖపట్నం సీబీఐ అధికారుల బృందం విచారణ నాలుగో రోజు శుక్రవారం కూడా జరిగింది. సీబీఐ అధికారులు అమలాపురంలోనే మకాం వేసి ఈ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న బాధ్యులను విచారిస్తున్నారు. ఐపీపీబీకి ఆన్‌లైన్ ద్వారా జరిగిన లావాదేవీలు తెలుసుకొనేందుకు అమలాపురం హెడ్ పోస్టాఫీస్ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని కంప్యూటర్లను తనిఖీ చేశారు. నిధుల గోల్‌మాల్‌కు కొద్ది రోజుల ముందు విలస పోస్టాఫీసు అధికారి (పీవో)గా పనిచేస్తున్న ప్రసన్నకుమారి అనారోగ్యం కారణంగా అప్పట్లో సెలవు పెట్టారు. సరిగ్గా అదే సమయంలో ఇన్‌చార్జి అధికారులుగా వెళ్లిన ఇద్దరు మహిళా అధికారులు ఈ గోల్‌మాల్‌లో శాఖాపరమైన ప్రాథమిక విచారణలో సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. గత ఏడాది నుంచి అస్వస్థతతో అమలాపురం సూర్యనగర్‌లో తన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న నాటి విలస పోస్టాఫీస్ అధికారి ప్రసన్నకుమారి ఇంటికి సీబీఐ అధికారులు శుక్రవారం వెళ్లి విచారించారు. ఈ కేసులో ఆమె ప్రమేయం లేకపోయినప్పటికీ అనారోగ్యంతో సెలవు పెట్టిన నాటికి ఐపీపీబీ లావాదేవీలు, తర్వాత ఇతరుల ప్రమేయంతో జరిగిన అవకతవకలపై ఆమెను ఆరా తీశారు. అప్పుడు అసలు ఏమి జరిగింది... ఎలాంటి కారణాలు నిధుల దుర్వినియోగానికి దారి తీశాయి వంటి అంశాలపై ఆమెను పలు ప్రశ్నలు వేశారు. నిధుల గోల్‌మాల్ సూత్రధారి సతీష్‌ను కూడా శుక్రవారం సీబీఐ అధికారులు లోతుగా విచారించారు. ఈ నిధుల దుర్వినియోగం అభియోగాలతో షోకాజ్ నోటీసులు అందుకున్న ఎనిమిది మంది పోస్టల్ ఉద్యోగులను కూడా సీబీఐ విచారించనుంది.



సీబీఐ విచారణ జరుగుతున్న అమలాపురం హెడ్ పోస్టాఫీస్